చామర్లకోట ప్లాట్‌ఫారంమీదకు మెడ్రాస్‌నించి వచ్చే మెయిల్ వస్తోంది—

అంత దూరాన్నించే మెయిల్ రాకని గమనించిన జనం హడావిడిగా సామాన్లు సర్దుకుంటూ కూలీలని తొందరచేస్తున్నారు.

కృష్ణా, ప్రియంవదాకూడా, కదిలి కాకినాడ కంపార్టుమెంట్ కోసం వెతుక్కుంటూ వెడుతున్నారు.

"రాజా—" కంపార్టుమెంట్ గుమ్మంలో నిలబడి కృష్ణను గుర్తించి ఆత్రంగా పిలుస్తోందో కంఠం.

అంత సందడిలోను ఆపిలుపు కృష్ణ కర్ణేంద్రియాలని స్పందించింది.

"అమ్మా! —" అంటూ అటు తిరిగాడు.

అప్పటికి రైలు పూర్తిగా ఆగింది.

ఆమె రైలుదిగి—"రాజా—అంత చిక్కిపోయావేమిట్రా" అంటూ సంతతధారగా స్రవిస్తున్న అశ్రువులతో కృష్ణ చెక్కిళ్లు నవరించి, గడ్డం పుణికింది.

ఆనందాబ్ధి చెలియలికట్ట తెంచుకుంటే పొలికివచ్చిన నీరు అది.

"అత్తయ్యా—" ప్రియంవద పలకరించింది. ఆ కంఠంలో తన ఉనికిని విస్మరించినందుకు రవంత మాత్సర్యం తొణికి ఉండవచ్చు.

అప్పుడు తెలిసివచ్చింది అత్తగారికి.

పరిస్థితి సంబాళించుకుంది.

"అదేమిటే పిల్లా—కళ్లల్లా లోతుకి పోయాయ్?—తిండితినడం లేదా మీరిద్దరూ?" అంటూ కోడల్ని దగ్గిరికి తీసుకుంది.

"బాగానే ఉన్నాం అత్తయ్యా, మామయ్య రాలేదేం?" అడిగింది ప్రియంవద.

"తీరా బయలుదేరే వేళకి ఏదో అర్జంటుపని అడ్డం వచ్చింది. నన్ను వెళ్లమన్నారు. ఆయన పన్లేమిటో ఆయనేమిటో — ఇంకెవళ్ళగొడవా అక్కర్లేదు." దగ్గర లేకపోవడంతో ఆయనమీదకు మళ్ళింది విసురు.

'కూలీ'ని కృష్ణ పిల్చి సామాన్లు దింపించి వాడినెత్తి కెక్కించాడు.

"అయ్యా-మీరు పైనించిరండి. నేను సామానిటు దాటించేస్తాను" అన్నాడు కూలీ.

ఓవర్‌బ్రిడ్జి దాటి కాకినాడ బండి ఎక్కేలోపున ఒక వందసార్లు ఇద్దర్నీ చీవాట్లు పెట్టింది కమలమ్మగారు, ఆరోగ్యం విషయం ఇద్దరూ అశ్రద్ధ చేస్తున్నందుకు.

ఇంటికి వచ్చారు. ఇల్లు తల్లికి అట్టే నచ్చినట్టులేదు.

"దీనికెన్ట్రా నలభై రూపాయలు? మండిపోతోంది దేశం-" అంది తమ ఊళ్ళో ఉన్న భవంతిని తల్చుకుని

"అమ్మా యిందాక అడిగావు చిక్కిపోయావేమని. మేనకోడలని మురిపెంకొద్దీ నా మెడకి తగిలించావు. ఇది అన్నం పెట్టడం లేదమ్మా." ప్రియంవదం కేసి క్రీగంట చూస్తూ నవ్వుతూ అన్నాడు

"చూడత్తయ్యా ఆమాటలు! తన ఫ్రెండ్సేమిటో— ఆ బాతాఖానీ లేమిటో అంతే—నా గొడవ అక్కర్లేదు నీముద్దులకొడుక్కి. ఇంట్లో అపకారాలయిపోయినా, బియ్యం అయిపోయినా, ఏం పట్టించుకోరు. నువ్వూ నాన్నా కలిసి నా గొంతుకోశారు" కృష్ణని వెక్కిరిస్తూ అంది

"చూశావా అమ్మా-ఇంక దీంతో నే కాపరం చెయ్యలేను. నీఎదురుగుండానే ఎల్లా అనేస్తోందో చూడమ్మా."

"మనం మహా తిన్నగా మాట్లాడినట్టు" కొట్టించింది ప్రియంవద.

"ఔరా ఔరా ఏంమాటలే అవి! పగలల్లా వాడు కాలేజీలో కష్టపడి వస్తుంటాడుగదా, పుస్తకాలు ముందేసుకుని కూర్చోకపోతే—పట్నమేగా యిది — నువ్వెళ్లి తెచ్చుకోరాదూ బజారు కెళ్ళి—మీ అక్కం జేస్తోంది బొంబాయిలో?"

"ఎంతయినా నువ్వు కొడుకునే వెనకేసుకొస్తావు. నేనేగా పరాయిదాన్ని."

తల్లీ కొడుకులు పకపక నవ్వుకున్నారు.

కమలమ్మగారి మనస్సంతా మాధుర్యంతో నిండింది కొడుకు కోడల్ని చూసి.

స్టేషన్లలో దొరికే అడ్డమైనగడ్డీ అత్తగారు తినదనీ, దానివల్ల ఆమెకు ఆపూట ఉపవాసమేననీ తెలిసిన ప్రియంవద వంటలోకి సిద్ధమౌతుంటే—

"అదేమిటే కుర్రనాగమ్మా— నువ్వుండు —" అంది కమలమ్మగారు.

"నీకు భోజనం కూడా లేదు గదత్తయ్యా—నువ్వు కాస్త హాయిగా కడుం వాల్చు—నిమిషంలో తెములేస్తాను" అంది.

"గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందిట! నా కళ్ళముందు పుట్టావ్, నాకే చెప్తావుటే—"విదిలించినట్టు మాట్లాడబోయిన ఆమెకంఠంలో అంతులేని ఆప్యాయతే గోచరించింది.

"నీచాదస్తం నీదేగాని ఏ పెక్కడున్నాయో నీకేం తెలుసత్తయ్యా? పెరుగు నువ్వు వంటే గాని అన్నీ నేనందించడమేగా?" చిన్నప్పటినించీ మేనత్తదగ్గర గారాబం పొందిన చనువిచ్చిన చొరవ అది.

37—వ పేజీ చూడండి

“ఇప్పుడేం అంతటక్కర్లేదు. నేనే చూసుకుంటాను.” కొంచెంచిన్నబుచ్చుకుందిగాని పట్టుమాత్రం విడవలేదు

“అదా సంగతి!” కొంచెం ఆలోచించినమీదట విదో అర్థమైనట్టు అంది ప్రియంవద

“ఏది సంగతి?”

“కొడుక్కి స్వహస్తపాకం తినిపించాలనా?— అల్లాగే చెప్పరాదూ. నేనేం కాదంటానా?” నవ్వేసింది.

“మహ బాగా కనిబెట్టావ్‌గాని—బియ్యం కడిగి పట్టా” ప్రియంవద వెళ్ళింది.

వంటకి అన్నీ సవరించి అత్తగారు పొయ్యిదగ్గర కూర్చుంటే పక్కనే కూర తరుగుతూ కూర్చుంది ప్రియంవద.

“ప్రియా—” కృష్ణగొంతుక పిలుస్తోంది వీధిగదిలోంచి.

ప్రియంవద పలకలేదు.

“ప్రియా—” కొంచెం గట్టిగాను, వినుగుతోను వినిపించింది మళ్ళీ

“వాడల్లా గొంతుక చించుకుని పిలుస్తుంటే చెల్లంకొట్టినరాయిలా కూర్చుంటావ్‌గాని కదలవేమే?”

“పనీ పాటూ లేదు ప్రియా ప్రియా అంటూ కూర్చోడం తప్ప ఆయనకి ఎదురుగా ఉన్నవే కనిపించవ్ అందిచ్చేవాళ్ళుంటే—ఇక్కడ పనిలో ఉన్నానా కాస్త చూసుకోకూడదూ?”

“ముందు వెళ్ళి వాడెందుకు పిలుస్తున్నాడో చూసిరా ఆ కూర నే తరుక్కుంటాను—ఊ— కదులు—”

అయిష్టంగానే కదిలింది ప్రియంవద.

ఈ లోపునే—“ప్రియా” మరింత గట్టిగా పిల్చాడు కృష్ణ.

“ఎందుకంత గావు కేకలు? అక్కడత్తయ్యకి కూర తరిగిస్తుంటే?” విసుక్కోబోయినా నవ్వాగలేదామెకు.

“నా కోటేది?”

“ఇప్పుడెందుకో సింగారం?”

“పెళ్ళిచూపులకి”

“అల్లాగేఉంది వాటం చూస్తే—”

“తమరు నోరు మూస్తారా?”

“ముయ్యకపోతే?”

“మూయిస్తాం—”

“మూయిస్తారేం?—అయితే మీ గుట్టు బయట పెట్టేస్తాను”

“ఏమిటో మహ—”

“మీరు సిగరెట్లు కాలుస్తున్నారని”

“చెప్పుకో—”

“అంతవరకూ వచ్చిందీ—అయితే ఉండండి— అత్తయ్యా—” ఇంక వాక్యం పూర్తికాలేదు

పిలుపు విని ఇటువచ్చిన కమలమ్మగారు ఆ దృశ్యం చూసి వెంటనే వెనక్కు మళ్ళింది నవ్వుకుంటూ

ఆమె రాకని వీరు గమనించలేదు

“ఛీ—సిగ్గు లేదు మనిషికి.” మందలించబోయినా మందహాసమే ధ్వనించింది స్వరంలో.

“ ...కపోతే చెప్తుందిట!”

అంతరం

26-వ పేజీ తిరుగు...

“ఇప్పుడైతే, నా నోరు ముయ్యగలిగారుగాని మీరు లేనప్పుడు చెప్తేనో?”

“ఆమాత్రం నమ్మకం నాకుంది.”

“బుద్ధిమంతులు!”

“ఇంతకీ నా కోటేది?”

“ఆ ఎదురుగా స్టాండు నేమిటో?”

“అరె! చూడనేలేదుస్మా!”

“మీరెందుకు చూస్తారూ, అందిచ్చేవాళ్ళుంటే? అవతల అత్తయ్యొక్కత్తీ వంట చూసుకుంటోంటే మీకు కోటు వెతికిచ్చేందుకో నౌకరు” అంటూ చేతి

ఆ ప్రాంతంలో కార్లమీద వెళ్లేవారెవరూ గంటకు ముప్పై మైళ్ళకంటే వేగంగా వెళ్ళరు. అక్కడరోడ్లుకొండలుఎక్కుతూ దిగుతూ ఉండటంచేత వంకర టింకరగా ఉంటాయి.

ఒకవన్నెల విసనకర్ర రివ్వున కారునడుపుతోంది. పోలీసు ఎలాగైతేనేం ఆమెనుఆపి, “కారుఆపమని నేను పెట్టిన కేకలు మీకు వినిపించలేదూ?” అని గద్దించి అడిగాడు.

“కేకలు పెడుతున్నదినువ్వా? కారుక్రింద పడ్డవారేమో అనుకున్నా” ఆమె అమాయకంగా తన్నుతాను సమర్థించుకున్నది.

టి. సుబ్బరాజు, (అమలాపురం)

కదించి—“ఇంక ఆజ్ఞ యిప్పిస్తారా?” అనేసి లోపలకెళ్ళింది.

కృష్ణ కోటుజేబులోని పర్సు తీసుకుని కోటు స్టాండునుంచేశాడు

“ఎందుకే పిల్చాడు?” కమలమ్మగారు కోడల్నడిగింది.

“నే చెప్పలా!—కోటు!—ఎదురుగుండానే ఉంది”

“ఉంటే మాత్రం—అందిస్తే అరిగిపోతావా?”

“అని నే నన్నానా—” అని కూర తరగడం మొదలెట్టింది

ఇంతలోకే “ప్రియా” మళ్ళీ పిల్చాడు కృష్ణ.

“అబ్బబ్బ—పలకలేక చచ్చిపోతున్నాను ఆ చెప్పేదేమిటో యిక్కడికొచ్చి చెప్పరాదు బాబూ” అరిచింది.

కృష్ణ వంటింటి గుమ్మందాకా వచ్చి—“అబ్బే ఏం లేదు—బజార్లో ఏమైనా కావలిస్తే వచ్చేటప్పుడు”

“బాగా జ్ఞాపకం చేశారు ఒక డజను చెక్కేళీ పళ్ళు, అరడజను బత్తాయిపళ్ళూ పట్టండి. రేపు అత్తయ్యకి ఏకాదశిగా—పెందరాళే మాత్రం వచ్చెయ్యండి — ఎవరితోనోహస్కు పెట్టుకుని కూర్చోక.”

“చిత్తం — వస్తానమ్మా — ” ఇద్దరికీ చెప్పి బయలు దేరాడు

“ఎంత జ్ఞాపకమే నీకూ—” తనవిషయంలో కోడలికిగల అమిత శ్రద్ధను గమనించిన ఆమె హృదయం పులకించిపోయింది

మేనత్త సంతోషం గుర్తించిన ప్రియంవద ముఖం వికసించింది

కమలమ్మగారు ఆలోచనలో పడింది ఏకాశి వారంటోజా ఉందవగా పోరడం మొదలుపెడితే పని హడావిడిలో అమాటే మర్చిపోతాడు భర్త చలి మిడే గతి తన నోటినించి మాట రాకుండానే జరిపిస్తోంది కోడలు—తనకొడుకుపెళ్ళాం—కృష్ణ తల్లి తను శంకరంగారి భార్య కాదు.

వంట అయిపోయింది

“అత్తయ్యా నువ్వు తినెయ్”—అంది ప్రియ.

“వాడు రాందేటే?”

“ఆయన ఏ తొమ్మిదింటికో, పదింటికో వస్తారు స్నేహితుల ఇళ్ళుచుట్టి పగలల్లా భోజనమే లేదాయె నీకు నువ్వు తినెయ్—నేనుంటాను”

“అబ్బె—”

“అబ్బెలేదు గిబ్బెలేదు నీవు తినకపోతే ఆయ వొచ్చి నామీద విరుచుకుపడతారు ఓ గంటాగితే నేనూ చేసేస్తాను లేకపోతే నానా తిట్లూ తిడతారు ఓసారల్లాగే కాసుకుకూర్చుంటే నన్ను తిట్టి అలిగి, అసలు తినడమే మానేశారు ఊ కానిచ్చెయ్—” తొందర పెట్టింది.

విధిలేక భోజనానికి కూర్చుంది కమలమ్మ గారు

మళ్ళీ యింటివిషయమే గుర్తుకు వచ్చిందామెకు రాత్రి ఎంత పొద్దుపోయినా భర్తకోసం వేచిఉండాలి తను ఒక తరంలో ఎంత అంతరం!

భోజనం అయ్యేటప్పటికి మంచంమీద మెత్తటి పరుపు పరిచి, మల్లెపువ్వులాంటి దుప్పటివేసి పడక సిద్ధం చేసింది కోడలు

తమ ఊళ్లో అందరి పక్కలూ తనే సిద్ధం చెయ్యాలి ఆయ నొచ్చేటప్పటికి ఏ పదకొండో పన్నెండో అవుతుంది. అప్పు డాయనకి వడ్డించి తను తినేటప్పటికి అలసిన తనకి కటికనేలే చాలనిపిస్తుంది పడుకునేటందుకు

మంచంమీద పడుకుందేగాని, నిద్ర రావడం లేదు ప్రియ తనని వంటింట్లోంచి బలవంతంగా నెట్టేసింది పైపని చెయ్యనివ్వకుండా

కోడల్ని, కొడుకుని చూస్తుంటే తనకి కడుపు నిండిపోతోంది సంతోషంతో ఆకలే కావడంలేదు—

చిలకా గోరింకల్లా అన్యోన్యంగా ఉన్నారు.

ఎంత మేనగోడలైనా తా నత్తగారు కావడంతో కొంచెం భయపడింది—ఏమంటే ఏమౌనుందో నని వెర్రిపిల్ల తనని పని ముట్టుకో నివ్వడంలేదు.

పాలికేళ్ళ కాపురంలో తనూ భర్తా పాతిక నిమ్ష

జీలు వాళ్ళతోఉండలేదు. ఆయన వ్యవసాయమేమిటో, వ్యవహారమేమిటో—అర్జనేమిటో అంతే—ఇంక ఏమీ అక్కర్లేదు. తన ఉనికినే ఆయన గుర్తించడు. పిల్లల కింత సంపాదించి పడెయ్యాలి. అదే ఆవే దన—అంతా యాంత్రికంగా ఉంటుంది తనకీనాటికీ భర్తతో కాస్త చనువుగా ఉండడమంటే భయమే. సిగ్గే, అలవాటులేని కారణంగా అన లామాటకొస్తే ఆయనతో మాట్లాడడానికి తనకి తీరుబడే ఉండదు. తనకి తీరుబడి అయినప్పు డాయనకి పని —పెళ్ళయిన కొత్తలో సిగ్గు, భయం, పెద్దల ఉనికీ అడ్డం వచ్చేవి. కలివిడిగా ఉండడానికి—ఆయనదీ బిడియపడే తత్వమే—ఇంతలోకే పిల్లలు—పిల్లలు కలగగానే తనకిక వాళ్ళతోనే సరిపోయేది— భర్త దగ్గర మొదట్లోఉండే భయమే, సిగ్గే, ఈనాటికీ నిల్చిపోయాయి.

నాలుగు రోజుల తరవాత—

పొద్దున్న వంటింట్లో మసులుతుండగా అడ్డంగా ఉన్న కత్తిపీట పొరపాటున తొక్కి వేలు కోసుకుంది కమలమ్మగారు కొంచెం లోతుగానే అయింది గాయం. రక్తం ధారగా వచ్చి,"అబ్బ"అంది చతికిలబడిపోయి.

"ఏమిటత్తయ్యా" అంటూ వచ్చిన ప్రియంవద హడిలిపోయి, "ఏమండీ—మిమ్మల్నే—ఇల్లా రండి" కంగారుగా పిల్చింది కృష్ణని.

గబగబ వచ్చిన కృష్ణ గుడ్డ చించి పౌడర్ అద్ది కట్టుకట్టి "ఎల్లా తెగింది?" అని అడిగాడు.

"కత్తిపీట తొక్కాను" అంది కమలమ్మగారు.

"ప్రియా! నీకు బుద్ధిలేదు. అడ్డదిడ్డంగా కత్తులూ, కత్తిపీటలూ పడెయ్యొద్దని నీ కెన్నిసార్లు చెప్పాను?" కోపంగా అన్నాడు.

"దాని తప్పేం లేదురా—నేనే పెట్టాను."

"నువ్వు పెడితే తను తియ్యొచ్చుగా." ఇంకా కోపంగానే అన్నాడు.

"ఒరేయ్! నీకు మరీ మతి పోతోంది. ఇంక నోరు మూసుకో—దాన్నంటే నామీద ఒట్టే"

రెండు మూడు గుడ్డలుకట్టినా రక్తం కారుతూనే వుంది.

కృష్ణవెళ్ళి డాక్టర్ని తీసుకువచ్చి, బాండేజి కట్టించి టి. టి. ఎస్. యిప్పించాడు, కమలమ్మగా రెంత అడ్డు పెట్టినా వినకుండా. అప్పటికిగాని అతనికి తృప్తి కలగలేదు.

"అనవసరంగా నిన్ను తిట్టాడు." అనునయిస్తుంది కమలమ్మగారు కోడల్ని.

"వాడే తప్పులే అత్తయ్యా ఇదివరకు ఆయనా యిల్లాగే తెగ్గోసుకున్నా రోసారి. అప్పుడు చెప్పారు. మళ్ళీ మతిమరుపే అయింది" అంది నొచ్చుకుంటూ ప్రియంవద.

కమలమ్మగారి మనస్సు మళ్ళీ గతంలోకి వెళ్ళింది. తను యింట్లో ఒకసారి కాఫీలోఉన్న కంచు గ్లాసు జారి కాలి బొటనవేలుమీదపడి వేలు చితికింది. కాఫీ ఒలికి పోయింది. "ఒళ్ళూ పై తెలీకుండా పడున్నంటే గ్లాసు జారకేం జేస్తుంది—గ్లాసుడు కాఫీ నేలపాలయింది. ఆ చితికినవేలుకి కాస్త తుంపి పసరు, పసుపు పట్టించు. అదే పోతుంది" అన్నాడు భర్త—కాఫీపాటి చెయ్యలేదు తన కాలివేలు—ఇక్కడ ఎంతో ఆదుర్దాపడిపోయి రాద్ధాంతం చేశారు కొడుకూ కోడలూ,

అంతరం

సాయంకాలం సినిమాకి బయల్దేరదీశారు కమలమ్మగార్ని కృష్ణ, ప్రియంవద. ఇంగ్లీషు సినిమా కట! "నాకేం అర్థం అవుతుందిరా" అంది కమలమ్మగారు. "అయ్యొ పిచ్చి తల్లీ—ఆ చూసే వాళ్ళంతా అర్థం అయే చూస్తున్నా రంటావా?—చూడడానికి ఏదో బాగుంటుందనిగాని" అన్నాడు కృష్ణ నవ్వుతూ థియేటర్లో ఉన్నవాటిలో పెద్ద తరగతికి తీసుకువెళ్ళి సోఫాలో కూర్చోపెట్టాడు. భాష తెలియక పోయినా భావం అర్థం అవుతూనే ఉంది పక్కనే కృష్ణ ఉండి అన్నీ విప్పి చెప్పడంచేత. ఎంతో అద్భుతంగా ఉంది సినిమా.

తను భర్తతో ఎప్పుడూ సినిమాకి వెళ్ళలేదు. ఏడాది, కోసారి బతిమాలితే యితర ఆడవాళ్ళతో వెళ్ళనిచ్చేవాడు పక్కఊళ్ళోఉన్న డేరా హాలులోకి వాళ్ళతోపాటే బెంచీలో కూర్చునేది తను. ఏ డొక్కు సినిమాయో చూసొచ్చి అదే బాగుందనుకునేవారు.

"అమ్మా! నేనూ ఈత కొడతానే" పదకొండేళ్ళ కుర్రాడు తల్లిదగ్గర మారాం చేస్తున్నాడు.

"వద్దు బాబు! మునిగిపోతావ్"

"మరి నాన్న ఈదుతున్నాడుగా."

"ఆయన కేం! భీమా చేయించుకున్నారు" అనేసి ఆమె నాలుక కరుచుకుంది.

వి. వి. తాతారావు (గుడివాడ)

మరోరోజు సాయంత్రం—

"కృష్ణా, కృష్ణా" బైటనించి పిలుపు వినిపించింది.

"ఎవరో చూడు—" కమలమ్మగారు కోడల్ని పురమాయించింది."

"రాహువు, కేతువు—" అంది ప్రియంవద నవ్వుతూ లేచి.

"అదేమిటే—"

"ఆయన స్నేహితులు—మూర్తిగారు శర్మగారూను. వాళ్ళంటే ప్రపంచం అక్కర్లేదు మీ కొడుక్కి— అంటూ వీధిలోకి వెళ్ళింది.

"అల్లా బజారు కెళ్ళారు. ఇప్పుడే వస్తారు కూర్చోండి."

"మళ్ళీ వస్తామమ్మా—"

"లేదు—వచ్చేస్తుంటారు. ఈలోగా అత్తయ్యని పలకరిద్దురుగాని" ఆహ్వానించింది—

ఇద్దరూ లోపలకు వచ్చారు.

"అత్తయ్యా—వీరు శర్మగారు, వీరు మూర్తిగారు—ఆయనతోపాటే కాలేజీలో లెక్చరర్లుగా ఉంటున్నారు." పరిచయం చేసింది.

ఇద్దరూ వినయంగా నమస్కరించా రామెకు. కమలమ్మగారు ప్రతినమస్కారం చేయబోగా వారించారు—"మీ కృష్ణలాంటివాళ్ళమే మేమూ. మీరు ఆశీర్వదించాలి మమ్మల్ని—" అంటూ.

కమలమ్మగారి కళ్ళు చమరించాయి.

"వారం రోజులుగా వద్దామనే అనుకుంటున్నాం—వాడూ చంపుతున్నాడు రమ్మని—ఇవాళ పడింది"

"బాబూ వాడుత్త కుర్రనాగమ్మా—ఏమీ తెలీదు—పరాయిఊళ్ళో మీరే వాడికి అన్నదమ్ములు—ఆప్తులు. కొంచెం జాగ్రత్తగా చూస్తుండండేం?—" అమాయకంగాను, మనస్ఫూర్తిగాను అంది కమలమ్మగారు.

ప్రియంవద నవ్వు ఆపుకుంది కష్టంమీద.

"వాడిని మేం జాగ్రత్తగా చూడడమేమిటమ్మా—మీ కింకా అద్దాల్లో బిడ్డడిలా కనబడుతున్నాడు గాని మాకే సలహా కావలసినా వాడిదగ్గరకే వస్తుంటాం. వాడిని కన్న మీరు నిజంగా అదృష్టవంతులు" అన్నాడు శర్మ.

కమలమ్మగారిముఖంలో సంతోషం గర్వం—తవిసించాయి.

ఇంతలోకే కృష్ణ తిరిగి వచ్చాడు.

"హల్లో— మీ రిక్కడే ఉన్నారా—మీ యిళ్ళు వెళ్ళడం—లేరనిపించుకోవడం అయింది. అమ్మా వీళ్ళు—"తల్లికి పరిచయంచెయ్యబోతుంటే—

"అయింది పరిచయం—" అంది ప్రియంవద.

"కానీను. నువ్వున్నావుగా—అమాటే మర్చిపోయాను. అమ్మా—వీళ్ళ నాగురించి లేనిపోనివేమైనా చెప్తుంటే నమ్మకు. నేనంటే ఎవ్వరికీ కిట్టదు" నవ్వేశాడు.

"మూర్తిగారు—మీరుమాత్రం మా అత్తయ్యకి ఆయన సిగ—" ప్రియ ఏదో చెప్పబోగా "ప్రియా" కోపం, అధికారం, వేడికోలూ మిళితం చేసిన స్వరంలో కృష్ణ చెప్పవద్దని సైగచేసి వారించగా—అక్కడితో ఆపేసి నవ్వేసింది ప్రియంవద.

"సిగ ఏమిటే—"కమలమ్మగారు అడిగింది.

"ఏంలేదమ్మా—"సిగపూలు" అని నే నో కథ రాసి పంపాను. అది ఆరు పత్రికలకి వెళ్ళి తిరిగి వచ్చింది. దాన్నేదిపించడానికి వీళ్ళంతా కలిసి అది వీళ్ళైనప్పు డల్లా పాడుతూంటారు." పెద్ద వ్యాఖ్యానం చెప్పి 'అయిందా నీ పని' అన్నట్టు ప్రియంవదకేసి చూశాడు కృష్ణ.

"ఇల్లాగే నా నోరు మూసేస్తున్నారు. అందుకే మూర్తిగారూ మిమ్మల్ని—"

ప్రియంవద మాట మధ్యలోనే ఉండగా లేవండు కుని,

"అమ్మా! మేంఅటు వెళ్ళొస్తాం. నువ్వూ ప్రియా భోంచేసెయ్యండి. నాకోసం కూర్చోవద్దు—పరతాయ్—" అన్నాడు.

ముగ్గురూ బయలుదేరారు.

"ఫ్రెండ్స్ ఉంటే ఇంకెవరూ అక్కర్లేదని నే మాటికే అన్నానూ—తువ్వొచ్చి యిన్నాళ్ళయిందా—

ఒక్క సాయంకాలం యింట్లో ఉన్నారా?—మంచి రోజు చూసి వాళ్ళతోనే చెప్పేస్తాను—అయ్యో ఈ పద్ధతి బాగు లేదని", నవ్వుతూ అంది ప్రియంవద.

"ఏం మాటలేఅవి?—వాళ్లెంత మంచివాళ్లే—అబ్బాయంటే వాళ్ళకెంత యిదే?—నీ వెర్రిగాని మొగాడయింతరవాత గుడిపాములా యింట్లో కూచుంటాట్టే—వాడి కేం తోస్తుంది?" కొడుకునీ, మిత్రుల్నీ వెనకేసుకొచ్చింది కమలమ్మగారు. తన కొడుకుని మెచ్చుకోడం, తనకి గౌరవం యివ్వడం ఆమె కెంతో సంతోషం చేకూర్చడంతో వాళ్ళ కృష్ణని ప్రియంవదకు దూరంచేస్తున్న భావం ఆమెకు తట్టలేదు.

తనని అందలంమీద కూర్చోపెట్టే కృష్ణని బట్టి, ఇతరులుకూడా భక్తివినయాలు ప్రదర్శిస్తున్నారు తనపట్ల. తమ ఊళ్లో తను శంకరం గారి భార్య చుట్టాల మధ్య శంకరం పెళ్ళాం తన కొక వ్యక్తిత్వం లేదు — ఘనత లేదు పల్లెటూరు కావడంవల్ల తను శుభకార్యాలలో తప్ప యిల్లు కదలదు. తనకు వేరే పరిచయస్థులంటూ ఎవరూ లేరు.

ఇక్కడ కృష్ణ అంతస్థు ఎంత పెరిగితే అంతకు పదింతలు తన అంతస్థు పెరుగుతుంది. "అంతటి కృష్ణను కన్న తల్లిగా—పుణ్యశాలినిగా"—కొడుకు ఘనతకంతకీ కారణం తన గర్భాన జన్మించడంగానే ఎంచడంతో తనకో ఉన్నత స్థానం లభ్యమైంది.

మర్నాడు మధ్యాహ్నం కృష్ణ తల్లినీ, ప్రియంవదనీ కాలేజీ చూపిస్తానని తీసుకెళ్లాడు. ప్రతిచోటా, "మా అమ్మ!" అని కృష్ణ పెద్ద పెద్దలందరికీ గర్వంగా పరిచయంచేస్తుంటే వాళ్లంతా గౌరవపురస్సరంగా నమస్కరిస్తుంటే తన జన్మ తరించిందనుకుంది కమలమ్మగారు.

తన లాబరేటరీకి తీసుకువెళ్లాడు కృష్ణ.

"అమ్మా ఈ కుక్కబొమ్మ ఉంది చూడూ! యిది దగ్గిరకెడితే బొంయ్ మంటుంది. మన రేడియోలు లేవూ—అటువంటి సూత్రంమీదే ఆధారపడివుంది దీనితత్వం—"

"అమ్మా యిదింకా చిత్రం—యీ తెరలోకి చూడు ఏం కనిపిస్తోంది—"

"అంతా చీకటే—"

"ఇంకొక్క అడుగు ముందుకెయ్—"

అడుగు ముందుకేసి 'బాబోయ్' అంది కమలమ్మ గారు లోపల లైటు వెలిగి మనిషి ప్రత్యక్షమవడంతో—

"కింద చూడమ్మా—ఒక లైట్ పెట్టాం—ఆ వెలుతురు యీ బల్బుమీదపడినంతసేపూ లోపల చీకటే—కాని నీకాలు అడ్డంరాగానే వెలుతురుకి అడ్డంవచ్చి లోపల దీపం వెలుగుతుంది దానంతట అదే— సినిమాలో మాటల్ని ఈ సూత్రంతోనే పిక్చర్‌మీద కెక్కిస్తున్నారు—"

నోటితో అక్కర్లేకుండా స్విచ్ నొక్కితే తిరిగే ఫేన్—వాటి సూత్రాలన్నీ సాధ్యమైనంత సులభశైలిలో తల్లికి విశదంచెయ్యబోతే అతని వెర్రితనానికి నవ్వుకుందామె—ఇన్ని వింతలూ తన కొడుకు తయారు చేసినవేనా అని ఆశ్చర్యపోయింది.

ఆఖరి అంశంగా టేప్ రికార్డర్ దగ్గిరకు తీసుకువెళ్లాడు. కమలమ్మగారిని ఏదేనా పాడమన్నాడు. తనకు సిగ్గువేసింది. అంతమంది ఎదుట పాడడానికి—అందరూ ప్రోత్సహించి, బలవంతపెట్టారు. తను పాడింది వెంటనే తిరిగి వినిపించాడు. ఆ పాటలోని మాధుర్యానికి అంతా ముగ్ధులయ్యారు.

చిన్నప్పుడు తనకి సంగీతం చెప్పించారు. తన కంఠాన్నంతా మెచ్చుకునేవారు. కాపురానికి వచ్చిం తరువాత సాధన చేసుకోవడమే పడలేదు. ఎప్పుడేనా మొదలుపెడితే భర్త చిరాకుపడేవాడు. అంచేతే సంగీతానికి స్వస్తి జరిగింది.

ఇన్నాళ్ళ కీనాడు మళ్లీ పాడే అవకాశం కల్పించాడు కొడుకు. తను ఎల్లా పాడినా మెచ్చుకున్నారు. ఎంత ఆనందం కలిగింది!

"మీ అమ్మగారింత గొప్పగా పాడగలరని ఎప్పుడూ చెప్పలేదేరా?— నువంత బాగా పాడగలగడం వంశపారంపర్యం అన్నమాట! శర్మా, మూర్తీ అడుగుతూంటే—కృష్ణ మతిపోయి చూస్తుంటే—ప్రియంవద ఆశ్చర్యంతో మునిగిపోతూంటే—ఆ సంతోషం పట్టలేక తనకి మూర్ఛవస్తుందనిపించింది.

"నీ పేరేమిటి?" జైలు చూడటానికి వెళ్ళిన సుబ్బయ్యగారు ఒక ఖైదీని అడిగాడు.

"9742" ఖైదీ తలతిక్కగా సమాధానం చెప్పాడు.

"నీపేరు చెప్పమంటే ఏదో అంకె చెబుతావేమిటి?" సుబ్బయ్యగారు విస్తుపోయారు.

"అదేనయ్యా! అది నా కలం పేరు" ఖైదీ చీదరించుకున్నాడు.

డి. హనుమంతయ్య (ఏలూరు)

స్టూడెంట్స్‌వచ్చి పాఠాలు చెప్పించుకుని కృష్ణను తెగ పొగుడుతూ గౌరవిస్తుంటే ఆ గౌరవమంతా తనకే జరిగినట్టనిపించేది కమలమ్మగారికి

నెల తిరక్కుండానే భర్తదగ్గిర్నించి ఉత్తరం వచ్చింది—

సత్యం, శివం వండలేక నానాఅవస్థ పడుతున్నారనీ—తనకి తిండి వంటబట్టటం లేదనీను

ఈమాత్రం ఆనందం అనుభవించడంకూడా ఆయన సహించలేడా అని కోపమే వచ్చింది కమలమ్మగారికి. కాని మర్యాదగా ఉండదని కొడుకుతో—"ఎల్లుండిమంచిరోజే—నన్ను పంపించెయ్యరా రాజా—" అందేకాని నిజంగా పంపిచేస్తాడేమోనని బెరుకుగానే ఉందామెకు.

కాని కృష్ణ అన్నాడు—"నాన్నదంతా చిత్రం మరీను. ఇంక రెండునెల్లదాకా పంపనని రాస్తాను. రాకరాక వచ్చావు అప్పుడే వెళ్ళడం ఏమిటి?"

"సత్యం, శివం నాలుగురోజుల వంటకే అలిసిపోయారా?—పోనీ వెంకమ్మగార్ని పిలవలేకపోయారా? ఏళ్ళకి ఏళ్ళు నువ్వు వండిపెడితే తిని కూర్చోడం అలవాటయి—ఏమైనా రెణ్ణెల్లదాకా నువ్వు వెళ్ళడానికి వీల్లేదు" అంది ప్రియ కూడా.

"అల్లా అంటే ఎల్లాగర్రా" అంది కమలమ్మగారు ఆంతర్యం మరోలా ఉన్నా.

మరోరోజు రాత్రి తొమ్మిదివ్వరవుతుంది— కమలమ్మగారికి నిద్రపట్టలేదు. మేలుకునే మంచం మీద పరుంది.

"ప్రియా! ప్రియా—" వీధిలోంచి పిలుపు.

"వస్తున్నా—" ప్రియ వెళ్లి తలుపు తీసింది. కృష్ణ వచ్చాడు.

"ఇల్లు కనబడిందా మీకు?"

"దారి మర్చిపోయాను"

"అవును మరి. ఆ మూర్తిగారూ, శర్మగారూ దొరికారు మా ప్రాణాలకి. మీరు దారీ మర్చిపోతారు. దారనీ మర్చిపోతారు—"

"హాయ్‌హాయ్ — పిల్లా కవిత్వం వచ్చేస్తోంది నీకూను."

"మీ అర్ధాంగినిగా. అయినా బొత్తిగా మంచి చెడ్డా లేకుండా పోతోంది—ఎప్పుడూ పదింటికేనా యిల్లు చేరేది—రోజూ అత్తయ్య మీకోసం కాచుకుని కూర్చోడం, నేను బలవంతపెట్టడం విసుక్కుంటూ ఆవిడ తినడం—"

"మరి నువ్వు?"

"నేను చెయ్యలే దివాళ."

"అమ్మ పడుకుందా?"

"ఆ— పాపం తనచేత్తో మీకు వడ్డించాలని ఉబలాటం ఆమెకి. మీకేమో ఊళ్లేలడమే సరిపాయె—ఆవిడ ఉన్నన్నాళ్లయినా కాస్త పెందరాళే తయారు చెయ్యకూడదూ?"

"నిజమేస్మీ — నాకానూట గుర్తులేదు. రేపట్నించి కాలేజీ అవగానే యింటికే వచ్చేస్తుంటాను సేరుగా."

"ఏమిటి—మీరే మాట్లాడుతూంటు! ఒక్కసారి హరిశ్చంద్రుడే అయిపోతారేమిటి కొంపదీసి.

"అంటే—" సాగదీశాడు

"ఈమాట లనడం ఇప్పటి కెన్నోసారి అని."

"నాకు బుద్ధిలేక నిన్ను కట్టుకున్నాను. మాటలు నేర్పిన కుక్క యిస్కో మంటే యిస్కో మందనీ—ఇదేనా భారతనారి ఆదర్శం?"

"తమరు శ్రీరాముడతంటి పూజ్యులనీ—నేను సీతాదేవిని కాలేకపోయానా?"

"ఇల్లాగే వాగుతూండు. ఎక్కడికో పారిపోతాను, ఎప్పుడో అప్పుడు"

"ఉద్ధరిస్తారు! కాని ఎడ్రస్ మాత్రం చెప్పిపోండేం—నేనూ వస్తాను మీ వెనకాలే—"

"స్వర్గానికెళ్ళినా నవితిపోరు తప్పదనీ—నువ్వెందుకూ తైనాతీ"

"లేకపోతే మిమ్మల్నిలా సేవించుకుతినేవా ళ్లుండద్దూ—నిజం చెప్పండి—నేనిల్లా కాకుండా ముంగిలా పడుండి అన్నింటికీ తలవంచితే మీ కానందంగా ఉంటుందా?"

"అమ్మ బాబోయ్! అల్లా మాత్రం చెయ్యకు. అసలు యింటికే రాబుద్ధిపుట్టదు."

"సరే సంతోషించాంగాని, పదండి అన్నం వడ్డి స్తాను."

"సరే, కాని ఒక్క షరతు. నువ్వు నా నోటికి అందిస్తూండు. నేను నీకు అందిస్తాను."

"బావుంది సరసం! ఇంక నాకేం పనిలేదు"

"అయితే నేను అసలు తినను"

"చెవులు మెలేస్తాను—వేషాలేస్తున్నారు—వేషా లని—"

కృష్ణ పలకలేదు

"సరే స్వామీ పదండి—మంకుపట్టులో చంటి పిల్లల్నే మరపించగలరు మీరు."

కంచంముందు కూర్చున్నా రిద్దరూ—

ప్రియ కృష్ణనోటికి ముద్ద అందించింది.

పొరపాటున వేలు కొరికాడు కృష్ణ.

"అబ్బ—ఛీ—ఇందుకే నేను భయపడ్డది" కళ్లల్లో నీళ్ళు తిరిగా యామెకు.

"అరెరె—అయామ్ సారీ—"

"సారీలేదు లారీ లేదు. లెంపకాయకొట్టి క్షమించ మన్నాట్ట వెనకటి కొడు" వేలు నొక్కుకుంటూ అంది

"ఏదీ బాగా నెప్పెట్టిందా?—" ఆమె వేలు తన చేతిలోకి తీసుకుని నిమిరాడు—"క్షమించు" అన్నాడు మళ్లీ బాధగా.

"పెద్ద—మళ్లీ ఈ వటవోటే—కావాలని కొరికి" అతన్ని కావాలని రెచ్చగొడుతూ అంది.

"అసలు ముక్కూడేలా కొరకవలసింది. అప్పుడు బుద్ధిగా ఉండేదానివి పొరపాటంటే నమ్మదు —పీడు."

"అంతపని మీకు చేతకాదనీ—"

నిద్రపట్టక ఈమాటలు వింటున్న కమ లమ్మగారికి వారి చిలిపితనం నవ్వు తెప్పించింది—

తనకీ భర్తకీ మధ్య యిటువంటి సంఘటన ఒక్కటుందా? అంత అదృష్టానికి తను నోచుకోందే— ప్రియంవద పూర్వజన్మ సుకృతం అది

ఏమిటి—కోడల్ని చూసి తానసూయపడు తోందా? ఛీ—ఛీ—అది అసూయకాదు. తన కొడుక్కు, భర్తద్వారా తాను పొందలేని ఆనందాన్ని జీవితం తనభార్య కివ్వంటే—తాను తన కొడుకు కావటంలోని విశిష్టత తనకు తెలిసిన ఆనందాన్ని అంది స్తోంది.

మరోసారి—తన కాలక్షేపానికి కృష్ణ కొని చ్చిన రామాయణంలో సీతాకల్యాణం ముగిసిన తరువాతిఘట్టం తీసింది—ఇదివరలో అప్పటి వరకు అయింది.

కల్యాణానంతరం సీతను తీసుకుని అయోధ్యకు తరలుతున్నారు రథాలమీద—

శ్రీరామచంద్రుడు అహల్యకు వాగ్దానం చేశాడు. తిరిగి వచ్చేటప్పుడు దర్శనం యిస్తానని. ఆమాట నిలబెట్టుకోవాలంటే రథాలని గౌతమాశ్రమం మీదుగా తరలించాలి. అలా దశరథుణ్ణి అడిగేందుకు ధైర్యంలేదు రాముడికి. ఘనమైన పనులైతే చేశాడుగాని, పదునారేళ్ల పాపడు. తండ్రిచాటు బిడ్డడు—తండ్రంటే ఎంత గౌరవమో అంతకు రెట్టింపు భయం—తండ్రితో ఎదురుగా మాట్లాడ లేదు.

అంచేతకౌసల్యనుసమీపించి తండ్రికిచెప్పమన్నాడు.

ఆమెకు ఏడుపు వచ్చింది—ప్రతిభావంతుడైన

అంతరం

రాముడి తల్లిమాత్రమే తను. దశరథుడికి తన మీద ఏమైనా గౌరవముంటే అది రామునివల్ల కలిగినదే—అటువంటి తనను, తనకు ఉన్నతి కల్పిం చిన కొడుకు తానై చెప్పలేనిది తనను చెప్పమంటు న్నాడు—"తండ్రీ—నీ తండ్రికి నీకంటె నే నెక్కువా?—నువ్వే చెప్పు" అంది కన్నీళ్ళతో—

శ్రీరామచంద్రుడికి పరిస్థితి అర్థమై—దుఃఖం పొంగింది—

అది చూసి కౌసల్య "అయ్యో—ఎంత పొరపా టైంది-చిట్టితండ్రిని అనవసరంగా నొప్పించాను" అనుకుని "పిచ్చితండ్రీ—బాధపడకు నేనే చెప్తా నులే—" అంది.

కమలమ్మగారికి కన్నీరు కాల్వలు కట్టింది తన స్థితీ, కౌసల్య పరిస్థితీ ఒక్కలాగే ఉంది—

తనకీ ఒక వ్యక్తిత్వం ఉందనీ, తన జీవితానికీ ఒక విలువ ఉందనీ, తన కిక్కడికి వచ్చిం తరువాతే తెలిసింది కొడుకు దగ్గరుంటే తన కెంత గౌరవం

"దీని వెనకవైపు సంతకంచేసి ఇవ్వండి" వరదయ్యకు చెక్కు-తిరిగిస్తూ బ్యాంకు గుమాస్తా చెప్పాడు. వరదయ్య దాన్ని తీసుకుని వెనకవైపున "విధేయుడు! ఇట్లు వరదయ్య" అని రాసి గుమాస్తాకు ఇచ్చాడు.

ఒ. వి. విద్యాధరరావు (విజయవాడ)

—ఆనందం—తనొచ్చిన యిన్ని రోజులలోను కనీసం వాడొచ్చి ఒక గంట తనతో మాట్లాడుతూ గడప లేదు—కాని తనకు అదేం బాధనిపించదు—కుర్రాడు వాడి యీడువాళ్లతో వాడికి తోస్తుందిగాని, తనతో గంటలతరబడి ఏం మాట్లాడగలడు?—

కృష్ణ రెండునెల్లదాకా తల్లిని పంపడానికి వీలుండ దని రాశాడుగాని—అదేం పడలేదు. తండ్రి తన తండ్రే—నెలన్నా నిండకుండానే తనకి ఆరోగ్యం బాగులేదనీ, కమలమ్మగార్ని పంపెయ్యమనీ రాశాడు.

ఈమాటు వెళ్లక తప్పదు ఈ ఊహ ఆమెను నిలువెల్లా కంపింపజేసింది—

ఈ స్వర్గంనించి మళ్లీ ఆ నరకంలోకి వెళ్లాలి. లంకంత కొంపలో తానొక్కతే—తెల్లారకుండా లేవాలి. మళ్లీ పడుకోవడం అర్ధరాత్రికే— నడుం విరిగే చాకిరీ—ఆదరణా, అప్యాయతా ఎరగని వాతావరణం—తన శ్రమకి కృతజ్ఞతకూడా కన పరచని మనుష్యులు. తను లేనప్పుడుతప్ప తన ఉని కినే గ్రహించని భర్త—తమ పాఠాలూ, ఆటలూ తప్పించి, మిగతావి అర్థంచేసుకునే యీడులేని యింకో యిద్దరు కొడుకులు. వారిమధ్య మళ్లీ ఆ పాతజీవితం ఆరంభించాలి

"నేను వెళ్లి నాన్నని కూడా తీసుకు వచ్చేస్తా నమ్మా—నువ్విక్కడే ఉండు. ఆయనే వస్తాడు" అన్నాడు కృష్ణ.

"అవునత్తయ్యా! సత్యం, శివం వాళ్ళ మ్యాడ్యున్ని ఊళ్లో హోటల్లో తింటూంటారు. చంటిపిల్లలేం కాదుగా—" వంతపాడింది ప్రియంవద.

"పిల్లేదే—ఎప్పుడూ వదలని యిల్లు—నే లేందే గడవదు తప్పదు, వెళ్ళిపోతాను" అందికమలమ్మగారు.

సాయంకాలం బజారుకి తీసుకువెళ్ళి తల్లికి రెండు పట్టు చీరలు, తండ్రికో పంచల బాపూ, తమ్ము ళ్లకి ఒట్టలు కొనిచ్చాడు కృష్ణ

మొన్నాడు చామర్లకోట మెయిల్ ఎక్కించ డానికివెళ్లారుకృష్ణా, ప్రియంవదా, కమలమ్మగారితో—

ఇల్లు కదిలింది మొదలు కమలమ్మగారు అశ్రు ధారలు స్రవిస్తూనే ఉంది ఎంత తెంచుకుందా మన్నా శక్యం కాలేదు—

"ఇన్నాళ్ళన్నా నీ దగ్గర కాస్సేపే నా మంచీ చెడ్డా మాట్లాడలేకపోయినందుకు క్షమించమ్మా—" అన్నాడు కృష్ణ గద్గదికంగా.

"ఛ పిచ్చినాన్నా—అదేమిట్రా అల్లా అంటావ్? నువ్వు నా కళ్లెదుట మసులుతూంటే వేరేమాట లెందుకూ?—అయినా నాతో మాట్లాడడానికి నీకు సంగతు లేముంటాయ్?—" అంటుంటే ఆమెకు దుఃఖం మరోసారి పెల్లుబికింది

"అమ్మా నాన్న నింక వ్యవసాయం కట్టిపెట్ట మను నేనూ రాస్తాను ఇప్పటికి ఆర్జించింది చాలు. సత్యాన్నీ, శివాన్నీ తీసుకుని మీ రిద్దరూ వచ్చెయ్యండి. అంతా యిక్కడే పడుందాం—"

"మామయ్యకి నచ్చజెప్పి అంతా వచ్చెయ్యం డత్తయ్యా—ఇక్కడ లింగూలిటుకూమంటూ మే మిద్దరం—అక్కడ మీరూ—ఎందుకు రెండు సంసా రాలు?—" అంది ప్రియంవద

రైలు కదిలేవేళకు కమలమ్మగారికి కన్నీరు మళ్లీ విజృంభించింది—

"రాజా—ప్రియ చిన్నపిల్ల—దాన్నేం అనకు. కష్ట పెట్టకు. తెలిసో తెలియకో తప్పు చేస్తే సద్దుకుపో— పెందరాళే యింటికి వచ్చేస్తూండు. ఒక్కర్తే దానికీ ఏం తోచదు. ప్రతి నాలుగు రోజులకీ ఉత్తరం రాస్తూండు. సెలవులకి తప్పకుండా వచ్చెయ్యండి. అమ్మాయ్! నువ్వూ అంతే—వాడేదేనా అంటే పట్టిం చుకుబాధపడకు—ఆరోగ్యం తిన్నగా చూసుకోండి—" ఏడుపుతో వెక్కుతూ మాట మాటకీ ఆగుతూ అంది కమలమ్మగారు

ప్రియ ఏడ్చేసింది.

"దిగగానే టెలిగ్రాం ఇమ్మనత్తయ్యా— మాకేం తోచదు అది వచ్చేదాకా—నువ్వుత్తరాలు రాస్తూండు. సాధ్యమైనంత త్వరగా వచ్చెయ్యండి అంతా—" అంది

రైలు కదిలి వెళ్లిపోయింది

ఇంటికి వచ్చేదాక ఉగ్గపట్టుకున్న కృష్ణదుఃఖం ఒక్కసారి పొంగింది—

"ఏమిటండీ యిది!—చంటిపిల్లల్లా—వాళ్లని తీసుకొచ్చేద్దాం—వినండి—నా మీ దొట్టే—" అంది ప్రియ సానునయంగా

"కాదు ప్రియా! నీకు తెలీదు—నాన్న రాడు అమ్మని రానివ్వడు అమ్మకి అస లిక్కడనించి వెళ్లడం యిష్టంలేదు" అంటుంటే అతని గొంతు దుఃఖంతో పూడిపోయింది.

★